

"డాక్టర్" ఆందోళనగా అతడి వైపు చూసాను నేను.

స్టెతస్కోప్ సవరించుకుంటూ నెమ్మదిగా పెదవి విరిచాడు డాక్టర్.

కె.జి.హెచ్.లోని భావనగర్ వార్డ్ అది. నా గుండెల్లో రాయి పడ్డట్టయింది.

కదలిపోతున్న డాక్టర్ని నేనూ అనుసరించాను. అతడో క్షణం ఆగి జాలిగా నా వేపు చూసాడు.

"ప్లీజ్ డాక్టర్. ఎలాగైనా సరే మా నాన్నని బ్రతికించాలి" గుండె గొంతుకలో కొట్లాడుతున్న ఆ మాటలు అతి కష్టంమీద అన్నాను నేను.

డాక్టర్ నాదగ్గరకు వచ్చి ఓదార్పుగా అన్నట్టు నా చేతిని నిమిరాడు.

"బ్రెయిన్ హెమరేజ్. పరిస్థితి ఆందోళనగానే ఉంది. అవసరమైన వారందరికీ టెలిగ్రాం ఇచ్చి రప్పించుకోండి!"

"అంతేనా!"

డాక్టరేమీ మాట్లాడలేదు. వడివడిగా వెళ్ళిపోయాడు అక్కడనుంచి.

నేను వెనక్కి గిరుక్కున తిరిగి బెడ్ దగ్గరకి వచ్చాను.


"ఏమండీ డాక్టరేమన్నారు?" శ్రీమతి అడిగింది భయంగా.

తన తల్లి మరో ప్రక్క శోకదేవతలా నిల్చుంది.

ఏం మాట్లాడలేదు నేను. మా నాన్న వంకే తదేకంగా చూస్తున్నాను.

మృత్యువు తన శీతల స్పర్శతో జోకొడుతున్నట్లుంది.

## పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ



# అద్దెకొంప

పి.వి.డి.ఎస్. ప్రకాష్

జీవచైతన్యం నాన్నలోంచి నెమ్మదిగా వీడ్కోలు తీసుకుంటున్నట్లుంది.

అచేతనంగా అలా పడుకున్నారు నాన్న.

నెల్లాళ్ళ క్రిందటే విశాఖలోని ఆఫీసులో చేరాను నేను. బదిలీమీద ఇక్కడికి వచ్చాను.

రెండురోజుల క్రిందట నా కుటుంబాన్ని తీసుకొచ్చాను.

'భీమ్లీ'లో ఉంటున్న నాన్నగారు నన్ను చూడ్డానికి వచ్చి ఇలా పడిపోయారు.

మండే ఎండల తీవ్రతవల్ల వడదెబ్బ తగిలిందన్నారు డాక్టర్లు.

ఆ వెంటనే పక్షవాతంతో కుడిచెయ్యి నోరు పడిపోయాయి.

అంతే!
కోమాలోకి వెళ్ళిపోయారు.

ఇప్పుడు తలలో రక్తనాళాలు దెబ్బతిన్నాయని బ్రతకటం కష్టం అంటున్నారు.

'భగవాన్!'

'ఎలాగైనా నాన్నను బ్రతికించవా!' రోదిస్తున్నాను మనసులో.

మా అమ్మ నుదుటిమీద సూర్యబింబంలా అరుణిమ లొలుకుతూ వెలిగే 'కుంకుమ' లేకుండా చేయకు!

నెమ్మదిగా నాన్న చేతిని పట్టుకున్నాను.

ఈ చేతులమీద ఎంతో ఆప్యాయంగా పెంచారు నన్ను.

ఈ గుండెలమీద ఎక్కి నాట్యం చేసాను నేను.

ఈ పెదవులతోనే చిన్నతనం నుంచి ఎంతో ఆప్యాయంగా ముద్దాడారు.

'నాన్నా! నీవు లేకుండా ఈలోకంలో ఉండలేను' బాధగా అనుకున్నాను.

'ఒక్కక్షణం ఒక్కసారి నా వంక చూడవా నాన్నా!'

'కన్నా' అని ఒక్కసారి నన్ను పిలవవా నాన్నా!''

కన్నీటితెరలవల్ల చూపు సరిగా ఆనటం లేదు.

* * *

ఈ వార్త తెలిసిన ఒక్కొక్కరు మా నాన్నని చూసేందుకు వస్తున్నారు.

ముకుందం నాన్నగారి దగ్గరే ఉంటూ చదువుకున్నాడు. నాన్న తన జీవితంలో ఎందరికో విద్యాదానం చేశారు. సరస్వతీ కటాక్షంవల్ల తను నేర్చిన అక్షరాలు అందరికీ పంచారు.

తను నిచ్చెనలా నిలుచుంటూ ఎందరో శిష్యులు ఉన్నత శిఖరాగ్రాలను అధిరోహించేలా చేశారు.

ఎప్పుడూ చెబుతూంటారు తన శిష్యుల గొప్పతనం గురించి.

'ఇలా ఎలా జరిగింది' ముకుందం అడిగాడు నన్ను బాధగా.

చెప్పాను.

''మాస్టారూ!, మళ్ళీ ఒక్కసారి కర్రె పట్టుకుని సుమతీ శతకం అప్పచెప్పమని గదమాయించండి'' ''చెవులు మెలేయండి మాస్టారూ'' ఏడుస్తున్నాడు ముకుందం.

చిన్నప్పటినుంచి అమ్మా నాన్నల ఆప్యాయత కరువై అనాథలా బ్రతికిన ముకుందాన్ని నాన్న చేరదీశారు.

ఏ కులమో ఏ వర్ణమో తెలీని ముకుందాన్ని ఆదరించడంవల్ల బంధువులంతా ఎడమైపోయారు.

అయినా నాన్న వినలేదు.

ఇప్పుడు ముకుందం విశాఖలో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు.

నేనే ఉద్యోగంవల్ల దూరప్రాంతాలకువెళ్ళి చివరి దశలోనైనా అమ్మానాన్నలకు చేరువలో ఉండాలని కోరి బదిలీ చేయించుకొని వచ్చాను.

''ఏమండీ'' పిలిచారెవరో. చూసాను. ఇంటిగలాయన.

''ఎలా ఉంది'' పరామర్శించాడతను.

తరువాత

''ఒక్కసారి ఇలా రాగలరా? మీతో మాట్లాడాలి'' అంటూ ప్రక్కకు తీసికెళ్ళాడు తను.

''ఇలా అంటున్నందుకు ఏమనుకోకండి''

''చెప్పండి''

''మీ బాధ అర్థం చేసుకున్నాను. ఈ విషాద సమయంలో ఈ మాటలు చెప్పకూడదు. అయినా తప్పనిసరి పరిస్థితిలో...'' నసిగాడు.

''ఫర్వాలేదు చెప్పండి...''

''మీ నాన్నగారు బ్రతకాలనే కోరుకుంటున్నాం. ఒకవేళ ఎట్టి పరిస్థితులోనైనా అనుకోకూడనిది జరిగితే...''

''జరిగితే...''

''బాడీని మాత్రం మా ఇంటికి తీసుకురావద్దు'' ఖచ్చితంగా చెప్పేసాడతను.

''క్షమించండి'' అంటూ వెళ్ళిపోయాడక్కడనుంచి మా ఇంటాయన.

ఏ విషయంపై ఆలోచించే ఓపికా తీరికాలేని పరిస్థితిలో స్థాణువులా నిల్చుండిపోయాను ఆయన వెళ్తున్నవైపు చూస్తూ.

* * *

''సారీ!'' డెత్ రిపోర్ట్ చేతికిస్తూ అన్నాడు డాక్టర్.

ఎర్రగావున్న ఆ కాగితం వేపు బాధగా చూసాను. ఆ కాగితం కూడా నాన్న శరీరంలా జీవం లేనిదే.

అయినా 'మృత్యు సందేశం' మోసుకొచ్చింది.

ఒక్కక్షణం ఆగాక చెప్పాడు డాక్టర్ ''త్వరగా మీ ఏర్పాట్లు చేసుకోండి. శవాన్ని బెడ్‌మీద ఉంచితే మిగతా పేషెంట్లు బెంబేలు పడతారు'' చెప్పాడతను.

అందుకే బెడ్ చుట్టూ 'స్క్రీన్' కట్టారు.

నాన్నగారిమీద పడి అమ్మ ఏడుస్తోంది: ''నా బ్రతుకిలా అధ్వాన్నం చేసారేమండి'' అంటూ.

నర్స్‌వచ్చి చెప్పింది ''ఇది ఆస్పత్రి దగ్గరగా ఏడ్వకండి'' అంతా రొటీన్.

గుండెల్లో ఉబుకుతున్న విషాదాన్ని కన్నీళ్ళ రూపంలో కూడా బయటకు పంపాలన్నా అడ్డంకులే.

'ఎక్కడికి తీసుకెళ్ళాలి శవాన్ని' ఆలోచిస్తున్నాను.

పట్నంలో ఇన్ని ఇళ్ళు, మేడలున్నా తనకంటూ ఇల్లు లేనందున ఎంత ఇబ్బంది.

అద్దెకున్న ఇంటి యజమాని 'శవాన్ని' తీసుకురావద్దన్నాడు.

ఇంకెవరు రానిస్తారు?

ముకుందం గుర్తొచ్చాడు. అతడికి పరిస్థితి చెప్పాను. నెమ్మదిగా అడిగాను.

''మీ ఇంటికి నాన్నగారి శవాన్ని తీసుకెడదాం''

ఖంగుతిన్నాడు ముకుందం.

''ఇంట్లో శ్రీమతి ఏమంటుందో అసలే పసిపాప ఉంది'' నసుగుతూ అన్నాడు.

అవును బ్రతికుంటే ఎవరినైనా ఆహ్వానిస్తారు.

చనిపోయిన తరువాత 'అంతిమ సంస్కారం' చేసేందుకు 'సొంత ఇల్లు' లేకుంటే ఎవరు మాత్రం ఆదరిస్తారు?

ఒకవేపు నాన్నపోయిన దుఃఖం మరోవేపు పరిష్కారం లేని సమస్య.

నర్స్ వచ్చి అంది. ''ఏం. ఇంకా ఇక్కడే ఉంచారు? తీసుకెళ్ళే ప్రయత్నం చేయరేమిటి?''

''తీసుకెళ్ళాలనే ఉంది ఎక్కడకో తెలీదు'' నర్స్ కోపంగా చూసి విసావిసా వెళ్ళిపోయింది.

ఒక్కటే ఆలోచించాను.

అసలే ఈ ఊరు కొత్త. మోసే నలుగుర్నీ సమకూర్చోవడం కూడా కష్టమే.

ఆస్పత్రి ముందు ఆగివున్న టాక్సీల దగ్గరికి వెళ్ళాను.

''చావుల మదం'' స్మశానానికి తీసుకెళ్ళాలి. ఎంత పుచ్చుకుంటావ్?''

''మూడొందలవుతుంది'' అన్నాడో టాక్సీ డ్రయివర్.

''ఒక్క కిలోమీటర్ దూరం కూడా లేదు. అంత డబ్బా?'' ఆశ్చర్యపోయాను.

''అవునండీ, శవమంటే మాటలా మళ్ళీ కారు కడుక్కోవాలి'' అన్నాడు.

అవును ఇది లోకం

మనిషికి మనిషికి మధ్య ఆత్మీయత, అనుబంధం కంటే కరెన్సీ నిరంకుశత్వమే రాజ్యమేలుతుంది.

అందరూ జనని కడుపులోనే జన్మిస్తారు అందరూ ధరణి పొరలలోనే



## చాకిరి

''రోజూ నువ్విలా వంట పనీ ఇంటి పని చేస్కునే బదులు మీ యావిడ్ని తీసుకొస్తే నీకీ శ్రమ తప్పుతుందిగా'' అన్నాడు శ్రీనివాసులు.

''ఈ చాకిరి రెట్టింపౌతుంది'' నిట్టూర్చాడు శంకర్రావు.

—పద్మశ్రీ (మాణిక్యారం)

## రాజమాత పాఠకులకు
## భగవద్గీత బహుమతి
## 7వ వారం విజేతలు

ఈ వారం ఆల్ కరెక్ట్‌గా రాసిన విజేత:

1. ఎ.గోపాలరావు (హైదరాబాద్)

వీరికి మహర్షి మార్కెటింగ్ వారు 'భగవద్గీత' బహుమతిగా పంపుతున్నారు. సొల్యూషన్: 1. 16— విష్ణువు, 2. 17 — వసుసేనుడు, 3. 18— మధువనం.

## (8వ వారం విజేతల వివరాలు వచ్చేవారం)



## పాయింట్

లెక్కల మాస్టారడిగాడు విన్నూని.

"నీ దగ్గర ఆరు మామిడి పళ్లున్నాయి. నేను మూడడిగాననుకో ఇంకా ఎన్నుంటాయి?"

"ఆరూ ఉంటాయి' తక్కున జవాబిచ్చింది.

—ఆర్.లక్ష్మి (సికింద్రాబాద్)

కలిసిపోతారు.

ఈసత్యం తెలీక మనమేదో శాశ్వతమనుకొని రంగు కాగితాలను జీవితాలను అంటిస్తే మనసుకి విలువెక్కడ?

మానవత్వానికి అర్థం ఎక్కడ?

ఇంకేం మాట్లాడలేదు -బేరం ఆడే సమయం సందర్భం కాదనిపించి ఒప్పేసుకున్నాను.

'అమ్మ'ని బెడ్ దగ్గర్నుంచి కదిలించటం కష్టమనిపించింది.

శ్రీమతిని, అమ్మని ఆటోలో ఇక్కడి అద్దెకున్న ఇంటికి పంపి కార్యక్రమంలో పడ్డాను.

టాక్సీ వెనుక సీటులో శవాన్ని పడుకోబెట్టేందుకు మరో వంద ఎక్కువ అడిగాడు డ్రయివర్.

టాక్సీదాకా తెచ్చేందుకు వంద రూపాయలు పుచ్చుకున్నారు ఆసుపత్రి సిబ్బంది.

విధిలేని పరిస్థితిలో డిక్కీలో వేయించి టాక్సీలో బయల్దేరాం నేను ముకుందం.

డ్రయివర్ అన్నాడు "ఊర్లో బ్రాహ్మణ్ణి మాస్తావని" 'అలాగే' అన్నాను.

మనసంతా దుఃఖంతో వేడుగా ఉంది.

అనుభూతి లేకుండా నిర్మలంగా ఉన్నాను నేను.

చిన్నతనంలో నాన్న వేలిని పట్టుకుని నడిచాను రోడ్డుమీద.

పెరిగి పెద్దయ్యాక స్నేహితుల్లా కబుర్లాడుకుంటూ నడిచాం.

ఏనాడు 'కారు' మీద ఎక్కడికీ వెళ్లలేదు.

ఆ తాహతు లేదు ఆ ఆశా లేదు నాన్నకి.

ఎవరికి ఏనాడు జీవితంలో మొదటిసారిగా కారెక్కించాను నేను.

నా పక్కన కూర్చోబెట్టలేదు.

'డిక్కీ'లో శాశ్వతంగా నిద్రపోతున్నారు.

బాధ బాధ

నలుగురు సాయంపట్టి మోస్తే కొడుకు దారి చూపుతాడుట.

మన నమ్మకం అది.

కానీ, నేను 'కార్లో' దర్జాగా కూర్చొని 'శవాన్ని' డిక్కీలో తీసికెడుతున్నాను.

పుత్రుడు 'పున్నామ నరకం' తప్పించడం అంటే ఇదేనా!

స్మశానం వచ్చింది.

దార్లో ఎక్కించిన బ్రాహ్మడి సాయంతో 'శవదహనం' జరిగింది.

మంటలు నాలుకలు సాచి ఆకాశాన్ని అంటుతున్నాయి.

నాన్న శరీరం దగ్ధమయింది.

మాడలేక మూర్ఛపోయాను.

అంతే!

* * *

పదేళ్ళు గడిచాయి.

నాన్నపోయిన దగ్గరనుంచి నాలో ఇల్లు కట్టుకోవాలన్న పట్టుదల దృఢంగా పెరిగింది.

అందరూ ఉన్నా దిక్కులేని వారులా పోయారు నాన్న. ఆ బాధ నన్ను కలచివేసింది.

ఆఫీసులో లోన్ తీసుకుని, ఇంట్లో బంగారం అమ్మి, మరికొంత స్నేహితుల దగ్గర అప్పుచేసి ఎలాగో ఇల్లు పూర్తిచేశాను.

ఇప్పుడు నాకు నిశ్చింతగా ఉంది.

ఇంటిముందు పూలమొక్కలు వేసుకొనేందుకు కొంత ఖాళీస్థలం.

రెండుభాగాల ఇల్లు. వాటిలో వంటిల్లు. బెడ్‌రూం. విజిటర్స్ రూం.

ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి శ్రీమతి ఎదురు వచ్చి చెప్పింది. 'అద్దెకు దిగేందుకు ఎవరో అడ్వాన్సిచ్చారని' 'అలాగా' అన్నాను.

మరో రెండు రోజులకు కారొక ఇంటిముందు ఓ కారు ఓ లారీ ఆగాయి. కారులోంచి దిగి ఇంటివేపు వస్తున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

వారెవరో కాదు గతంలో వారింట్లోనే మేం అద్దెకుంది.

శ్రీమతికూడా ఆశ్చర్యంలో మునిగిపోయింది.

వాళ్ళబ్బాయిని ఇదివరలో తనుచూడలేదు.

కార్లోంచి నెమ్మదిగా ఒకప్పటి మా ఇంటి యజమాని పరంధామయ్యని మోసుకొస్తున్నారు.

అతనికి పక్షవాతంట.

నెమ్మదినెమ్మదిగా లారీలోంచి సామాన్లు తెచ్చి ఇంట్లో సర్దారు.

ఒకరినొకరు పలకరించుకున్నాం.

ఇంటి యజమాని నన్ను గుర్తుపట్టి ఎందుకో 'గిల్టీ'గా ఫీలయ్యాడు.

ఈ పదేళ్లలో వారు బాగా చితికిపోయారుట ఇల్లూ వాకిలీ అమ్మేసుకున్నారట.

ఒక్కకొడుకు లెక్కల కష్టం మీదనే కుటుంబం భారంగా గడుస్తోందని మాటల ద్వారా అర్థమైంది నాకు.

* * *

ఓ అర్ధరాత్రి వేళ

తలుపులు కొట్టారెవరో. బద్ధకంగా లేచివెళ్ళి తలుపు తీసాను.

పరంధామయ్య కొడుకు నిలుచున్నాడు. 'ఏం విషయం' అడిగాను నేను.

"నాన్నగారికి సీరియస్ చేసింది" చెప్పాడు. "కొంచెం చూస్తుండండి. టాక్సీ తీసుకొచ్చి ఆస్పత్రికి తీసుకెడతాను. మావాళ్ళు బెంగపడుతున్నారు. మీరుకాస్త ధయిర్యం చెప్పరూ" దీనంగా అడిగాడు.

"సరే" అన్నాను.

మరో అయిదు నిమిషాల్లో టాక్సీలో ఆసుపత్రికి తరలించారు పరంధామయ్యని. ఇంట్లో పడుకున్నానే కాని నిద్రపట్టలేదు.

'ఎలా ఉందో అతనికి' మాటిమాటికీ అనుకోసాగాను.

మా నాన్న మళ్ళీ గుర్తుకొచ్చారీవేళ. కళ్ళు చెమ్మగిల్లాయి.

తెలతెలవారుతుండగా అతడొచ్చాడు.

అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"నాన్నగారు లేరండి. తెల్లవారుజామున నాలుగుగంటలికి పోయారు" చెప్పాడు. దగ్గరికి తీసుకొని నెమ్మదిగా ఓదార్చాను.

"ఒక్కసాయం చేసిపెట్టరూ" అడిగాడతను.

"ఏమిటి"

"ఏం లేదు. బాడీని ఇక్కడికి తెచ్చుకుంటాం. అద్దెకుంటున్నాం కదా? మీ అనుమతి కోసం..."

"ఛ...ఛ.." అతనేమీ మాట్లాడలేదు.

"ఈ కష్టం అందరికీ వచ్చేదే. తీసుకురా తప్పకుండా" అన్నాను.

అతను వెళ్ళిపోయాడు ఏర్పాట్లు చేసుకునేందుకు.

ఆరోజు మా నాన్నగారు చనిపోయినప్పుడు ఇలా అనేవారెవరూ లేకపోయారు.

పాపం 'అనాథ'లా పోయారు నాన్న.

'జాతస్య మరణం ధ్రువమ్'

పుట్టిన ప్రతి మనిషి చావక తప్పదు. వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు- జగతి పురాతన సత్యం.

ఈ శరీరమే ఒక అద్దెకొంప. ఆయుష్షునే అద్దెగా ఇస్తూ ఉంటాం.

ఆయుష్షు తీరగానే ఖాళీచేసి వెళ్ళిపోక తప్పదు.

అదే శాశ్వతం కాదు ఇక కట్టుకున్న ఈ 'అద్దెకొంప' శాశ్వతమా!

ఎందుకో,

గాఢంగా నిట్టూర్చాను.

*


### పరిమళ్ ఫాన్సీ శారీస్ బహుమతి విజేతలు 20వ వారం

1. ఎం.హనుమాయమ్మ (మచిలీపట్నం)
2. శ్రీమతి పద్మారావు (కాకినాడ)
3. బి.వి.ఎస్.రావు (వుయ్యూరు)
4. శ్రీమతి ఆదిలక్ష్మి వి. (గుంటూరు)
5. పి.విజయలక్ష్మి (ఖమ్మం)

విజేతలందరికీ పరిమళ్ ఫాన్సీ శారీస్‌ని పంపిస్తున్నాం.

(పరిమళ్ ఫాన్సీ శారీస్ 21వ వారం ఫలితాలు వచ్చేవారం)